***సంతృప్తి అనే తరువుకే సంతోష సుమాలు విరబూస్తాయి. సంతృప్తీ, సాధనా బ్రతుకు బండికి జోడు గుర్రాలైతే, ఆనందం, అభివృద్ధి కూడా స్వంతమౌతాయి.***

# పిచ్చుకగూడు

సీతారాంపురంలోని మా పిచ్చుకగూడుకి పునఃప్రవేశ సందర్భంగా మన చిన్ననాటి స్నేహబృందాన్ని ఇక్కడకు రమ్మని ఆహ్వానిస్తున్నాను. అందరి చిరునామాలూ, ఫోన్ నెంబర్లూ వెనుకపేజీలో రాస్తున్నాను. మీరుగా సంప్రదించుకుని, ఈ ఉత్తరం అందిన వారం పదిరోజుల తర్వాత ఎప్పుడైనా సరే, అందరూ ఒక్కసారిగా గానీ లేక కొందరు కొందరుగా గానీ, మీ మీ వీలునుబట్టి ఆలోచించుకుని, రాకపోకల సమాచారాన్ని నాకు కొంచెం ముందుగా తెలియజేస్తే, తగిన ఏర్పాట్లు చేయగలిగే సావకాశం ఉంటుందని మనవిచేస్తున్నా.

మూడునాలుగు రోజులు బాల్యస్మృతులను నెమరువేసుకుంటూ మనమందరం ఆనందంగా గడపాలనే నా కోరికే ఈ పిలుపుకి ముఖ్య కారణం. మన సమావేశం మనకి ఉల్లాసాన్నీ, ఉత్సాహాన్నీ కలిగించే టానిక్కులా పనిచేస్తుందనే నమ్మకంతో తప్పక హాజరవుతారని ఆశిస్తున్నాను.

ఇట్లు

**(ఇప్పటి) మాధవరావు (ఒకప్పటి మీ మధు)**

ఆ ఉత్తరం చదవగానే కొంచెం ఆశ్చర్యంగా అనిపిచింది. అప్పుడప్పుడు ఫోనులో పలకరించుకోవడమే గానీ ఉత్తరాల అలవాటు లేదు. అందుకే వాడు ఉత్తరం రాయడం కొత్తగా ఉంది.

వెనుకపేజీలో ఉన్న మా స్నేహితుల వివరాలు చూశాను. ఆ ఆరుగురిలో నలుగురం మా సీతారాంపురానికి చెందినవాళ్ళమే. మిగతా ఇద్దరూ పక్క ఊరి వాళ్ళు. మా అందరి హైస్కూలు చదువు మాకు దగ్గర్లో ఉన్న బస్తీలో జరిగింది. మధు ఒక్కడే మా ఊరిలో వ్యవసాయం చూసుకుంటున్నాడు గానీ మేము మాత్రం ఉద్యోగాలరీత్యా ఎక్కడెక్కడో తిరిగి వేరే వేరే చోట్ల స్థిరపడ్డాం.

మధు కూడా భార్య చనిపోయాక హైద్రాబాద్‌లో ఉంటున్న కొడుకు దగ్గరకు వెళ్ళిపోయాడు. మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత సొంత ఊరుకి ఎందుకు చేరినట్లు...? ఏదో కొత్తగా గృహప్రవేశం చేస్తున్నట్టు మమ్మల్ని పిలవటంలో, సరదాగా గడపాలనే కోరిక కాకుండా ఇంకేదైనా ఉద్దేశం ఉన్నదా? నాలుగైదు గదులున్న పెద్దమండువా లోగిలిని పిచ్చుకగూడు అని ఎందుకు అంటున్నాడో?

మా వాళ్ళతో కలిసి తర్వాత మళ్లీ వెళ్ళొచ్చుగానీ ముందుగా నేనొక్కడినే వెళ్ళి నా సందేహాలకు సమాధానాలు తెలుసుకోవాలనే ఆత్రుతలో వెంటనే బయలుదేరాను. నాలుగుగంటల ప్రయాణమే కాబట్టి ఇబ్బందేమీ లేకపోయింది. నన్ను చూడగానే మధు ఆప్యాయంగా ఆహ్వానించాడు. నేనొక్కడినే ముందుగా వచ్చిన కారణం చెబుతూ నా సందేహాల చిట్టా విప్పబోతుంటే, అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం అంటూ దాటవేశాడు. ఆ ఇంట్లో వాడొక్కడే ఉంటాడనుకున్న నా అంచనా తప్పింది. అయిదారుగురు పైనే కనిపించారు. పండుటాకుల్లా ఉన్న దంపతుల్ని పెద్దమ్మ, పెదనాన్న అని, ఇద్దరు నడివయసు స్త్రీలని అక్క, అత్తయ్య అనీ, ఒకమ్మాయిని మేనకోడలనీ, పదీ పన్నెండేళ్ళ పిల్లాడిని మనవడనీ పరిచయం చేశాడు.

నేను స్నానంచేసి వచ్చేసరికి అత్తయ్య అని చెప్పినావిడ మా ఇద్దరికీ ప్లేట్లలో వేడివేడివి చల్ల పునుకులట, తెచ్చిచ్చారు. ఇష్టంగా తింటుంటే ఆవిడ మా దగ్గరే కూర్చుని తృప్తిగా ఇంకొంచెం... ఇంకొంచెం... అని కొసరికొసరి వడ్డించారు. ఆ ఆప్యాయత వల్లనో లేక చాలనాళ్ళకు స్నేహితుడితో కలిసి తింటున్నందువల్లనోగానీ అవి చాలా రుచిగా అనిపించాయి.

కాసేపటికే వాతావరణం బాగా చల్లబడిపోయింది. ఇద్దరం నడుచుకుంటూ మా ఊరు ఏటి గట్టుమీదున్న రావిచెట్టు చుట్టూ ఉండే సిమెంట్ చప్టామీద కూర్చున్నాం. చాలానాళ్ళ తర్వాత సొంత ఊరులో అడుగుపెట్టిన వాళ్ళెవరి మనసైనా మధురమైన బాల్యస్మృతులతో మైమరచిపోవటం సహజమే!

సాయంకాలపు చల్లగాలికి చెట్టునీడన చిన్ననాటి స్నేహితుడి చెంత కూర్చుని ఏటి అలల్ని చూస్తుంటే, ఏదో పరవశం చుట్టుముట్టినట్లైంది. రెండుక్షణాలు మౌనంగా ఉండి పోయాను.

కాసేపటి తర్వాత మధు నావైపు చిరునవ్వుతో చూసి “కథ మొదలుపెట్టమంటావా?” అన్నాడు. నేను కొంచెం ఆశ్చర్యంగా “కథా...?” అన్నా. “నేను మళ్ళీ మన ఊరికే ఎందుకుచేరాను? వగైరా విషయాలన్నీ వివరిస్తే అదో చిన్నపాటి కథలానే ఉంటుందనిపించి అలా అన్నాను” అన్నాడు.

మధు మొదలుపెట్టాడు.

“నేను ఇక్కడే వ్యవసాయం చూసుకుంటూ ఉండిపోతే, మా అబ్బాయి మాత్రం చదువు పూర్తయ్యాక, ఉద్యోగం చేయకుండా వ్యాపారం మొదలుపెట్టాడని నీకూ తెలుసుగా మన ఊరివాడివే కాబట్టి నీకూ మా కుటుంబం గురించి చాలా విషయాలు తెలుసు. అయినా ఒక వరసలో నాకు గుర్తుకొచ్చినవి చెప్పుకుపోతుంటాను, విను.

మావాడికి వ్యాపారంలో కలిసొచ్చి బాగా సంపాదించగలిగాడు. నిజాయితీపరుడనే పేరు తెచ్చుకోవడం వల్లనే బిజినెస్‌లో బాగా రాణించగలిగాడని నేననుకుంటాను. తనకి తోచినట్టు

కొంతమందికి సహాయాలూ చేస్తుండేవాడు. ఐశ్వర్యం కలిగాక, అధికారం కావాలనే కోరిక పుడుతుందేమో. అందుకే వాడు రాజకీయాలలోకి ప్రవేశించాలను కుంటున్నానని నాతో చెప్పినప్పుడు నేను ఆశ్చర్యపోలేదు. అయితే మామూలుగానే “చక్కగా వ్యాపారం చేసుకుంటూ సుఖంగా ఉన్నావ్, రాజకీయాల బురదలోకి దిగటం ఎందుకురా, నీలాంటివాళ్ళు నెగ్గుకురాలేరు” అన్నాను. వాడు “అందరూ అలా అనుకుంటే ఎలా నాన్నా, సమర్థులూ, నిజాయితీపరులూ రాజకీయాల్లోకి వస్తేనే కదా సమాజం బాగుపడుతుంది” అన్నాడు. ఆ తరువాత ఇంకోమాటా అన్నాడు “నమ్మిన సిద్ధాంతాలను వదులుకోవలసిన పరిస్థితులు వస్తే, నేనూ తాతగారిలాగే అప్పుడు రాజకీయాల నుండి తప్పుకుంటాను. అలా నీకు మాట ఇస్తున్నా...”

వాడామాట అన్నందుకు నిజంగానే నాకు చాలా సంతోషమేసింది. మా నాన్న రాజకీయాలలో ఉండి స్వంత భూముల్ని కొన్ని అమ్మేశారే గానీ అదనంగా పైసా కూడా సంపాదించుకోలేదు. ప్రజల కోసమే పనిచేశారు. ఎన్ని పదవులు నిర్వహించినా అధికార దుర్వినియోగానికీ, కుటుంబ ప్రయోజనాలకీ పాల్పడలేదు. పగవాళ్ళు కూడా ఆయన నిజాయితీని శంకించలేని విధంగా జీవించారు.

మా వాడు మళ్ళీ మా నాన్నలా అంత మంచి పేరు తెచ్చుకోగలడని నాకు ఆ క్షణంలో నమ్మకం కుదిరింది. వాడు తాతగారి వారసత్వాన్ని అందుకుంటున్నందుకు, గర్వంగా ఆనందంగా అనిపించింది.

వాళ్ళమ్మ చనిపోయినప్పుడు నన్ను తన దగ్గరికి వచ్చేయమని అడిగాడు. “అమ్మ ఉన్నప్పుడు పదిమంది వస్తూపోతూ ఉండేవారు కాబట్టి ఇల్లు సందడిగా ఉండేది. ఇప్పుడు మీరొక్కరూ అక్కడ ఉండలేరు. ఇక్కడైతే మేమందరం ఉంటాం, ఆపైన ఎప్పుడూ పదిమంది వస్తుంటారు. మీకు కాలక్షేపమూ బావుంటుంది. వ్యాపారంలో, రాజకీయాల్లో మీ సలహాలు, సూచనలు నాకు అందుతాయి కాబట్టి నాక్కూడా బావుంటుంది” అన్నాడు.

వాడు చిన్న వయసులోనే రాజకీయాలలోకి ప్రవేశించిన కొద్దికాలానికే మంత్రి పదవి పొందగలిగాడు. వాడికి వెన్నుదన్నుగా ఉండి, నా సలహా సహకారాలతో ఎంతోకొంత సాయం చేయటం నా బాధ్యతగా అనుకుని మరో ఆలోచన లేకుండా హైదరాబాద్ వెళ్ళిపోయాను. ఇక్కడ ఉన్న కొద్దిపాటి పొలాలను కౌలుకిచ్చేసి, అన్ని ఆస్తిపాస్తుల్ని వాడికి అప్పగించేసి నిశ్చింతగా ఉన్నట్టు భావించాను.

నాలుగు అంతస్తుల ఇంద్రభవనం లాంటి ఇంట్లో మనవలతో, వచ్చే పోయేవాళ్ళతో నాకు రోజులు బాగానే గడిచిపోతున్నాయనుకుంటూండగా ఏదో జరిగిందనిపించింది. ఆ వాతావరణం నాకు పరిపడక నా మానసిక ఆరోగ్యం దెబ్బతిన్నట్లయింది.

నా కొడుకే నాకు కొత్తగా అనిపించేవాడు. వాడి ఇంటి పద్ధతులు, ప్రవర్తన అన్నీ నాకూ విడ్డూరమే. ‘తరాల అంతరం వల్ల ఇప్పటి పరిస్థితులకు నేనే సర్దుకోలేక అశాంతితో మథనపడుతున్నానా?’ అని ఆలోచించేవాడిని.

మొదట్లో నేనేం చెప్పినా మా అబ్బాయి మౌనంగా వినేవాడు. అయితే ఆ మాటలు లక్ష్యపెట్టడం లేదని నాకు తర్వాత తెలిసివచ్చింది. రానురాను నేనేదైనా చెప్పబోతే, “మీకెందుకు నాన్నా ఈ

విషయాలు విశ్రాంతిగా కూర్చోండి" అని సుతిమెత్తగా బదులిచ్చేవాడు. క్రమేపీ ఆ మాటలు ఒక ఆర్డర్‌లా ధ్వనించటం మొదలైంది!

ఇంట్లోగానీ, బయటగానీ ఏ చిన్నతంతుకైనా అత్యంత అట్టహాసం, ఆడంబరం తప్పనిసరి! మారిన రోజులు, పరిస్థితులనుబట్టి అందరిదీ అదే బాట కదా అనుకున్నానే గానీ తప్పు అనుకోలేదు. ధృతరాష్ట్రుడిలా పుత్రప్రేమతో వాడిచర్యల్ని సమర్థిస్తున్నట్టు మౌనంగా ఉండిపోయాను. అలవాట్లలో ఉండే ఆడంబరానికి నాకు అభ్యంతరం లేకపోయింది గానీ నైతిక విలువలకి తిలోదకాలిస్తున్నట్లు అనుమానం రాగానే తల్లడిల్లిపోయాను. హెచ్చరించకుండా ఉండలేకపోయాను.

"ఇవి మునుపటి మీ రోజులు కావు నాన్నా! ఎలా సంపాదించినా సరే డబ్బున్నవాడి మాటే చెల్లుబాటు అవుతుంది! మనిషి బ్రతకటానికి తిండీ, నిద్రా ఎలా అవసరమో, రాజకీయాల్లో మనుగడకి డబ్బు, లౌక్యం రెండూ అవసరం! నలుగురూ నడిచే దారిలోనే మనమూ నడవాలి గానీ నేనొక్కడినీ మడికట్టుకుని కూర్చోవడం కుదరని పని!" అని నిక్కచ్చిగా నాకే ఎదురు బోధించాడు!

ఆ తర్వాత నా జోక్యం కూడదనే విషయం నాకు తెలియజెప్పినట్లుగా నన్ను నాలుగో అంతస్తులో ఉన్న మూలగదిలోకి తరలించారు! నా ఆరోగ్యానికి విశ్రాంతి అవసరమనే నెపంతో నేను నలుగురు మధ్యలోకీ రాకుండా అలా నిషేధం విధించాడు. పైకి కనిపించని సంకెళ్లతో నాకు నచ్చని, నాకు రుచించని వాతావరణంలో నేను బందీనయ్యాను! ఆ రోజుల్లోనే మా అబ్బాయి నాకో పని అప్పగించాడు.

తన వ్యాపారమిత్రుడు ఏదో ఊళ్ళో ఒక రైతుతో పొలం కొనుగోలు విషయంగా ఒప్పందం కుదుర్చుకున్నాడట! కానీ తర్వాత తన కుటుంబ సభ్యులకి ఇష్టం లేదంటూ అమ్మకానికి అభ్యంతరం చెప్పాడట! ఆ అన్యాయాన్ని సరిదిద్ది మిత్రుడికి సాయం చేయాలని మావాడు తన అనుచరులతో ఒక పథక రచన చేశాడు. తన అనుచరులతో కలిసి నన్ను ఆ ఊరికి వెళ్ళమని మా అబ్బాయి నాకు పురమాయించాడు.

అసలు విషయమేమిటో ఎవరూ వివరించకపోయినా నాకు అర్థమైంది!

"వాడి జన్మకి లక్షరూపాయలు కళ్ళ చూడటమే గొప్ప! అలాంటిది నేను పది లక్షలు పైనే ఇస్తుంటే, కోట్లు ఖరీదుచేస్తుందంటూ నా డబ్బు తీసుకోవడానికి బెట్టు చేస్తున్నాడు. ఆశకు అంతుండాలి! ఏమీ ఇవ్వకుండా ఊడలాక్కుంటే సరి! అప్పుడు వాడిబతుకు ఏమిటో వాడికి అర్థమౌతుంది! మంచికి రోజులు కావు. అమ్మా బాబూ అంటే మాట వినరు!" అంటూ మా అబ్బాయి వ్యాపారమిత్రుడు శివాలెత్తటం విన్నాను కనుకనే నాక విషయమేమిటో తెలిసింది! దౌర్జన్యంగా కబ్జా చేస్తారన్నమాట!

ఇదేం అన్యాయమంటూ మావాడితో వాదనకు దిగాను. ఇందులో నీకెంత లాభం వస్తోందని నిలదీశాను. అలాంటి పనిలో నన్నూ పాలు పంచుకోమనటం సిగ్గుచేటని చిరాకుపడ్డాను.

ఆ స్నేహితుడికి చాలా పలుకుబడి ఉందని, అతనికి మాట సాయం చేస్తే, వచ్చే ఎన్నికల్లో అతని ఊరి ప్రజల ఓట్లన్నీ గంపగుత్తగా తనకే పడతాయని నిజాయితీగా చెప్పేశాడు. తర్వాత మళ్ళీ సర్దుకున్నాడు. "మీరు అక్కడికి వెళ్తే, మంత్రిగారి ప్రమేయం ఉంది కాబట్టి తమకి అన్యాయం జరగదని ఆ రైతు కుటుంబం నమ్ముతుంది. నా స్నేహితుడు కూడా వాళ్ళకి అన్యాయం జరగకుండా వాళ్ళకు

సమ్మతమైనట్లుగా మంచిధర ఇస్తానని అంటున్నాడు. ఆ ప్రయత్నానికే వీళ్ళు వెళ్తున్నారు...” అన్నాడు. ఆ మాటలు నమ్మానో లేదో నాకు తెలియదు గానీ ప్రయాణం మాత్రం తప్పనిసరి అని నాకు అర్థమైంది!

ఒక వ్యాన్, కారులో పదిమంది బయలుదేరాం. దారిలో ఏదో వాగు పొంగి దారికి ఆటంకం ఏర్పడింది.

మళ్ళీ వెనక్కి వెళ్ళాం. ఆ ఊరికి చేరుకోవడానికి చుట్టూ తిరిగెళ్ళే మార్గం ఉందని ఎవరో చెబితే, అందర్నీ కనుక్కుంటూ కొత్తదారిలో ప్రయాణం మొదలుపెట్టాం.

అందరికీ ఆకలిగా అనిపించింది. మధ్యలో ఏదో ఊరులో ఆగాం. దారినిపోతున్న ఒకాయనని ఆపి “ఇక్కడ భోజనానికి ఏదైనా..” అని అంటూండగానే “ఇటురండి” అని ఎవరో ఒకాయన పిలిచాడు. “మీరు పొరుగూరువాళ్ళా? దూరం నుండి వస్తున్నారా?” అని ప్రశ్నించి, ‘పాపమ్మగారి అన్నప్రసాదశాల’ అని బోర్డు పెట్టి ఉన్న ఇంట్లోకి మమ్మల్ని వెంటబెట్టుకుని వెళ్ళాడు. ఎవర్నో గట్టిగా అరిచి పిలిచి మా భోజనాల సంగతి చూడమని పురమాయించి అతను హడావుడిగా వెళ్ళిపోయాడు.

అక్కడ ఏం ఉన్నాయో తెలుసుకుని ఆర్డరివ్వాలనుకుంటూండగానే ఒకతను చకచకా బల్లమీద రెండు మూడు అరిటాకులు పరిచి వేడివేడి పదార్థాల్ని వడ్డించేశాడు. అందరూ ఆకలితో ఉన్నారేమో అవురావురుమంటూ తినేశారు.

నేను అతనితో బిల్లు సంగతి ప్రస్తావించేసరికి అతను నవ్వి, “మీరు చాలా దూరం నుండి వచ్చారు కాబోలు. ఇక్కడ రేట్లేమీ ఉండవండి. మా ఊరివాళ్ళయితే తమకు తోచినంత ఆ హుండీలో వేస్తారు. పొరుగూరు వాళ్ళకైతే అతిథి మర్యాదగా భోజనం పెడతాంగానీ డబ్బులేమీ తీసుకోమండీ...” అన్నాడు.

నేను విస్తుపోయాను. “అలా ఉచితంగా పెడితే మీకేం లాభం వస్తుందీ?” అనడిగాను.

“మీరు తృప్తిగా తిని ఆకలి తీరి ఆనందించారు కదా, ఆ ఆనందమే మేం పొందే లాభం! డబ్బు కంటే అలాంటి ఆనందమే గొప్పదని ధర్మన్నగారు మా ఊరివాళ్ళందరికీ బాగా నూరిపోశారండి” అంటూ మళ్ళీ నవ్వాడు.

“ధర్మన్నగారు ఎవరు... ఏమిటీ...” అని అతన్ని అడిగితే చాలా వింత విషయాలు చెప్పాడు.

ఆ ఊరిపేరు ధర్మాపురం. ఊరిపెద్ద పేరు ధర్మారావు. ఊళ్ళో ఉన్న భూములన్నీ ఆయనవే. అయితే చాలా సంవత్సరాల క్రిందట ఆయన ఆ భూముల్ని ఊరికి చెందిన ఉమ్మడి ఆస్తిగా ప్రకటించేశారట! వ్యవసాయం పనులు, ఇతరత్రావి అన్నీ విభజించుకుని ఎవరి పనులు వాళ్ళు చేసుకుపోతారట! మేం కార్లు ఆపినచోట ఓ పెద్ద చావిడి ముందు ‘గోపన్నగారి పశుసంరక్షణశాల’ అని బోర్డు ఉండడం చూశాను. దాని సంగతేమిటని వాకబు చేశాను. అదీ ధర్మన్నగారే ఏర్పాటు చేశారని అతను చెప్పాడు. వట్టిపోయిన ఏ పశువునీ కబేళాకివ్వకుండా అక్కడ అప్పచెబితే, వాటికి జీవితాంతం పోషణ జరుగుతుంది. ఈ ఊళ్ళో పశువులకి కూడా సహజమరణమే గానీ వాటిని వధించటం నిషిద్ధం!

ఈ సమాచారమంతా వినేసరికి నాకు నిజంగా అద్భుతంలా అనిపించింది! నాతో వచ్చిన వాళ్ళందర్నీ కార్లలోనే కాసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పి నేను ధర్మన్నగారిని కలవటానికి వెళ్ళాను.

మాకు వడ్డన చేసిన అతను నా గురించి ధర్మన్న గారికి చెప్పి వెళ్ళిపోయాడు. ఆయనతోపాటే ఆ ఇంటిముందున్న చెట్ల నీడలో మంచం మీద కూర్చున్నాను. ఆ ఇంటినీ, పరిసరాల్నీ నేను ఆశ్చర్యంగా చూస్తుంటే, ఆయన నవ్వుతూ, "ఇంతకీ విషయం ఏమిటి?" అని అడిగారు.

"ఊరంతటికీ ధనవంతులైన మీరు, ఇంత చిన్న పిచ్చుకగూడు లాంటి ఇంట్లో ఉండటం ఆశ్చర్యంగా ఉంది" అన్నాను.

ఆయన మళ్ళీ పెద్దగా, హాయిగా నవ్వారు. "నాకు పిచ్చుకలంటే చాలా ప్రేమ. ఎందుకో నాకే సరిగ్గా తెలియదు. మా ఇంటి చుట్టూ ఉన్న ఈ చెట్లలో చాలా పిచ్చుక గూళ్ళున్నాయి. ఏ ఇంటి పరిసరాలలో ఎక్కడా కనిపించనన్ని పిచ్చుకలు ఇన్ని ఇక్కడ ఉండటం నా అదృష్టమనుకుంటాను. ఉదయమే నిద్రలేవగానే పిచ్చుకమ్మల కిచకిచల కబుర్లు వినటం చాలా ఆనందంగా ఉంటుంది. ఈ విషయాలేవీ తెలియకుండానే మీరు మా ఇంటిని 'పిచ్చుకగూడు' అనటం నాకు చాలా సంతోషంగా ఉంది!" అన్నారు.

ఒక నిముషం ఆగి, ఆయనే మళ్ళీ అన్నారు, "పిచ్చుక చిన్నప్రాణి. పుల్ల, పుడక, ఏరుకొచ్చి తన కష్టంతో తనకు సరిపోయేంత చిన్నగూడు కట్టుకుంటుంది. పిచ్చుక నిరాడంబరతకు చిహ్నం అన్నమాట! అందుకే నాకిష్టం అనుకుంటా! ఏ మనిషైనా పిచ్చుకను ఆదర్శంగా తీసుకుంటే జీవితం సమస్యలమయం కాకుండా సుఖంగా సాగిపోతుంది! విలాసాలు, ఆడంబరాలపట్ల మోజు పెంచుకోవటం వల్లే మనుషులు దారి తప్పుతున్నారేమో అనుకుంటాను. అందుకే ఎన్ని అడ్డదారులైనా తొక్కి డబ్బు సంపాదించుకుంటున్నారు" అంటూ నిట్టూర్చారు.

నేనూ అంగీకరిస్తున్నట్లుగా తల ఊపాను.

"మేమిద్దరం, మా మనవడితో కలిసి మూడు పిచ్చుకలం ఈ గూడులో ఉంటున్నాం. మాకు ఈ మాత్రం సరిపోదా! ఇంకా పెద్దగూడు ఎందుకండీ? అవసరానికి మించి అదనంగా ఏదీ ఉండకూడదనేది నా సిద్ధాంతం" అంటూ నావైపు చూసి "మీరు ఏదో అభిమానంగా నన్ను పలకరించాలని వస్తే నేనేదేదో చెప్పుకుపోతున్నాను" అన్నారు.

"కాదు కాదు, ఇప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను కాబట్టిగానీ, లేకపోతే మీలాంటి వ్యక్తీ, ఇలాంటి ఊరూ ఉందని ఎవరైనా వచ్చి నాకు చెబితే నేను నమ్మేవాడినే కాదు. మీ గురించి తెలుసుకోవాలనే ఆసక్తితోనే ఇక్కడికి వచ్చాను. భోజనం చేసి అటు నుండి అటు వెళ్ళిపోయినాగానీ, రేపైనా మీ వివరాలు తెలుసుకోవడానికి వచ్చేవాడిని. మీ గురించి మీ ఊరు గురించి వివరంగా చెప్పండి. నలుగురున్న కుటుంబాన్ని ఒక్కమాటమీద నడిపించటమే కష్టం! అలాంటిది ఇంతమంది ఊరు ప్రజల్ని ఒక్క త్రాటిమీదకు ఎలా తేగలిగారు? ఇది నాకు చాలా వింతగా ఉంది!"

"నిజమే, చాలా కష్టపడాల్సి వచ్చింది! నేను నలభై సంవత్సరాల వయసులో అమెరికా నుంచి ఈ ఊరికి వచ్చేశాను. ఈ ఊరు ఇలా రూపుదిద్దుకోవటానికి ఇరవై ఏళ్ళ నుంచీ ప్రయత్నిస్తూనే ఉన్నాను"

ఆయన మాటలకు నేను నోరెళ్ళబెట్టాను. “ఏమిటీ...! మీరు విదేశాల్లో ఉండి వచ్చారా?”

“ఏమిటండీ, అంత ఆశ్చర్యం, స్వర్గానికి వెళ్లొచ్చానని ఏం చెప్పలేదుగా?”

‘‘కానీ మీరు ఇక్కడే పుట్టి పెరిగినట్లుగా, అచ్చమైన రైతులా పంచె కట్టుతో ఉంటేనూ...” అంటూ నసిగాను.

ధర్మన్నగారు కులాసాగా నవ్వారు. “నేను ఇక్కడే పుట్టిపెరిగిన అచ్చమైన రైతుబిడ్డనే. అయితే మధ్యలో కొన్నేళ్ళు విదేశాలలో ఉద్యోగం వెలగబెట్టి వచ్చాను. అంతే! మనకి నచ్చినవిధంగా ఇల్లు కట్టుకున్నట్లుగానే, నా భావాలకు అనుగుణంగా మా ఊరు వాళ్ళందరూ కూడా నాతో కలిసి నడిచినందువల్లే నా ఆశ తీరింది...!

“మీలో ఇలాంటి ఆశ, ఆశయం ఏర్పడటానికి కారణం ఏమిటి? మీకు స్ఫూర్తి ఎవరో తెలుసుకోవచ్చా?” అని అడిగాను.

“మీరంత ఇష్టంగా అడుగుతుంటే చెప్పకుండా ఎందుకుంటాను. నా వయసువాళ్ళతో కబుర్లు చెప్పుకోవటం నాకూ ఆనందమే. వివరంగా చెబుతాను వినండి.

“నేను చిన్నప్పుడు కొంచెం దురుసుగా, అల్లరిగా ఉండేవాడిని. మా స్కూలులో నా తరగతిలోనే మా పాలేరు కొడుకు రమణ చదువుతూ ఉండేవాడు. వాళ్ళ నాన్నతో కలిసి మా ఇంటికి వస్తూ ఏదో చిన్న చిన్న పనులు చేస్తుండేవాడు. మా అమ్మ నాకు పెట్టే చిరుతిళ్ళు వాడికీ పెట్టడం, వాడితో ఆదరంగా మాట్లాడటం నాకు నచ్చేది కాదు. నన్ను చిన్నబుచ్చినట్లుగా ఉండేది. ఆధిపత్యం చూపించుకోవాలనుకున్నాను. ఒకరోజు నాతో ఏదో వేళాకోళంగా మాట్లాడితే, నేను వాడిని కాలితో తన్ని గట్టిగా తిట్టాను. వాడు ఏడుస్తూ వెళ్ళిపోవడం చూసిన నాన్నగారు విషయం తెలుసుకుని నన్ను కోప్పడ్డారు. నాతో వాడు సమానమని అనుకోవడం నాకు నచ్చలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాను.

“నీతో సమానంకాక తక్కువని ఎందుకనుకుంటున్నావ్? వేర్వేరు కుటుంబాలలో పుట్టడమేగానీ వేరే గొప్పతనం నీకేముంది? అసలు నీకో నిజం చెప్పనా? మీ అమ్మకి పిల్లలు పుట్టకపోవడంతో రమణకంటే ముందు పుట్టిన నిన్ను తెచ్చుకుని మేం పెంచుకుంటున్నాం” అన్నారు.

నాకిక ఏడుపు ఆగలేదు. రమణ ఇంటికి వెళ్ళి ఒక మూల ఏడుస్తూ పడుకున్నాను. వాళ్ళెంతగా అడిగినా కారణం చెప్పలేదు. రమణ అమ్మానాన్న కంగారుపడి, నన్ను బలవంతంగా మోసుకొచ్చి ఇంటికి తీసుకొచ్చి అప్పచెప్పారు.

ఆ తర్వాత నాన్నగారు నవ్వుతూ “మనుష్యుల ప్రవర్తనబట్టి మాత్రమే ఎక్కువ తక్కువలుంటాయి గానీ పుట్టుకతో కాదని నీ మనసులో నాటుకునేట్లుగా చెప్పాలనే ఉద్దేశంతో ఆ సమయానికి ఏదో సినిమా సన్నివేశం గుర్తొచ్చి అలా అన్నానంతే...” అంటూ బుజ్జగించారు.

అలా ఆ వయసులో మా నాన్నగారు నాకో పాఠం నేర్పించారు! పుట్టుకలో, పదవిలో తేడాలు ఉండొచ్చుగానీ, మనుష్యులుగా మాత్రం అంతా ఒకటేనన్న నిజం నేను మనస్ఫూర్తిగా నమ్మాను కాబట్టి దానిని ఆచరణలోనూ పెట్టాను. వారసత్వంగా వచ్చిన భూములన్నీ నా ఒక్కడివే అనుకోవటం నాకు

నచ్చలేదు. మా ఊరినంతా ఓ ఉమ్మడి కుటుంబంగా మార్చి నా ఆస్తిపాస్తులు మా ఊరికి రాసిచ్చేశాను. మా ఊళ్ళో ఏ కుటుంబం కూడా బ్యాంకులో డబ్బు దాచుకోదంటే నమ్మండి. దేవుడి గుడి, బడి, హాస్పిటల్, అన్నసత్రం... ఇలా అన్నింటి ముందూ ఉండే హుండీలలో ఎవరికి వాళ్ళు స్వచ్ఛందంగా తోచినంత వేస్తారు.

ఎక్కువ తక్కువలు అసలేం లేవని చెప్పలేను గానీ, ప్రాథమిక అవసరాలకి మాత్రం ఎవరికీ లోటులేదు. అందరిళ్ళూ చిన్నవే అయినా సౌకర్యాలు, సదుపాయాలకు మాత్రం లోటు లేదు.

కొట్లాటలు, కేసులు, దొంగతనాలు లాంటివేవీ మా వూళ్ళో లేనేలేవు! గొప్ప చెప్పుకుంటున్నానని అనుకోకపోతే ఒకమాట... ఎక్కడికి వెళ్ళినా ధర్మవరం వాసులంటే నీతి నిజాయితీలకు నిలబడతారనే ముద్ర పడిపోయింది!

ఎవరింట్లో శుభకార్యం తలపెట్టినా అది ఊరందరిదిగా జరుగుతుంది! చదువులు, పెళ్ళి ఖర్చులు, వైద్యం అన్నీ ఉమ్మడిఖాతాలే! ఉచితం అనేమాట ఎవరికీ ఇష్టం ఉండదు. పనిచేస్తున్నాం. ఫలితం పంచుకుంటున్నాం... ఇదే అనుకుంటాం!"

"చాలా గొప్పగా ఉందండి. మీ అమ్మానాన్న గారి పేర్లు గోపన్న, పాపమ్మ... అంతేగా" అన్నాను.

కాదన్నట్లుగా తల ఊపుతూ ఆయన పెద్దగా నవ్వారు. "మీకా సందేహం ఎందుకొచ్చిందో నాకు అర్థమైంది. అదీ చెబుతానుండండి" అన్నారు.

"ఒకసారి నేనూ మా అబ్బాయీ పశువుల్ని కొనటానికి పొరుగూరు సంతకి వెళ్ళాం. అక్కడ ఒక చోట నీడపట్టున కారు ఆపి అటూ ఇటూ చూస్తున్నప్పుడు చిన్నగట్టుమీద తట్టలు మోసే అవ్వ కూర్చుని అన్నం క్యారేజీ విప్పటం గమనించాను. రెండు ముద్దలైనా పూర్తిగా తినకుండానే కొంచెం దూరంలో కూర్చున్న పిల్లాడిని పిలిచి అన్నం తినమంది. వాడు పూర్తిగా తినేసి హుషారుగా గెంతుకుంటూ వెళ్ళిపోయాడు. నేను ఆసక్తితో "అదేంటమ్మా, నువ్వేం తినకుండానే ఆ పిల్లాడికి పెట్టావెందుకు, నీ మనవడా?" అనడిగా.

'కాదు బాబూ, ఎవరో నాకూ తెలియదు. వాడు నావైపూ, అన్నంగిన్నె వైపూ ఎంత ఆకలిగా చూస్తున్నాడో గమనించాక నాకు తినబుద్ధి కాలేదు. ఆకలి తీరాక ఎంత ఆనందంగా పరుగెత్తాడో చూశారుగా, ఇప్పుడు నాకూ కడుపు నిండినట్లే ఉంది...' అంది నవ్వుతూ.

దాచుకోవడం కంటే, పంచుకోవటంలోనే ఆనందం ఉందనే మంచి తత్వాన్ని నేర్పించిన ఆ అవ్వ పేరు పాపమ్మ అని తెలుసుకున్నాను. ఆ తర్వాత ప్రారంభించిన అన్న సత్రానికి ఆమె పేరు పెట్టి, ఆమె చేతే ప్రారంభం చేయించాను కూడా. ఆవిడను వెతికి పట్టుకోవడం చాలా కష్టమైపోయిందనుకోండి... కాకపోతే అదో సరదా, అంతే....!

ఇక పశుసంరక్షణశాల గురించి... ఒకసారి నేను ఎక్కడికో వెళ్ళి వస్తోంటే, పక్క ఊళ్ళోనే ఎవరింటిముందో గొడవ జరుగుతోంది. కాసేపు అక్కడ ఆగాను. విషయం తెలిసింది. ఒక ఆవును

పట్టుకుని ఒక నడివయసాయన గోలుగోలున ఏడుస్తున్నాడు. అక్కడ నిలబడిన నాకు వాళ్ళావిడ ఫిర్యాదు చేసింది 'చూడండి బాబూ, ఇన్నాళ్ళూ పాలిచ్చిన తల్లే, అయితే మాత్రం ఒట్టిపోయాక దున్నలేని ఆ ముసలి ఎద్దునీ, ఈ ఆవునీ అమ్మెద్దంటాడు. మడుసులకే తిండి లేకపోతుంటే, వీటిని సాకటం మాటలా? వాడి గోడు వాడిదేగానీ మా మాట వినడే" అంది.

నా మనసు ద్రవించిపోయింది. వాళ్ళకి సహాయం చేసి అప్పటికి సర్దుబాటు చేశాను. ఆ సంఘటనే "పశు సంరక్షణశాల" స్థాపించటానికి నాంది. మీకిప్పుడు అర్థమైందిగా, అతని పేరు గోపన్న!"

ధర్మన్నగారి మాటలు వింటుంటే, ఎందుకోగానీ అప్రయత్నంగా నా కళ్ళు చెమ్మగిల్లాయి!

"చాలా మంచి విషయాలు చెప్పారు. మిమ్మల్ని కలవటం నాకు గొప్ప ఆనందంగా ఉంది" అన్నాను.

ఆయన నవ్వి "భలేవారే! ఇందులో నా గొప్ప ఏం లేదు. మన పెద్దలు 'మనిషికి సాయం... పశువుకి గ్రాసం...' అన్నారు. అంతకన్నా ఉత్తమమైన జీవనధర్మం ఉండదని నేనూ నమ్మాను. అదే ఆచరించాను. గొప్పతనం ఏదన్నా ఉంటే, అది మా ఊరి తల్లులదే! పిల్లలకి వాళ్ళు గోరుముద్దలతో పాటు ధర్మాన్ని తప్పకూడదనే మంచి మాటలనూ వంటబట్టించారు! అందువల్లే ఊరందరిదీ ఒకే బాటగా మారింది!

"మీ మనవడు ఇక్కడే ఉంటున్నాడు. మరి మీ అబ్బాయి ఎక్కడ?" నా సందేహం బయటపెట్టాను.

"వాడు డాక్టరు. పక్కనున్న పట్నంలో పెద్ద హాస్పిటల్ కట్టించాడు. ఇక్కడా ఓ బ్రాంచి ఉంది. అవసరమైన కేసుల్ని అక్కడికి తీసుకెళ్తారు. నేను అప్పుడప్పుడు వెళ్ళి ఓ వారం రోజులు అక్కడా ఉండి వస్తుంటాను. వాడూ అంతే. ఎవరికి నచ్చిన దారిలో వాళ్ళు నడవటమే మంచి పద్ధతి కదండీ!

మా అబ్బాయికి ఓ కూతురు ఉంది. నాకు మంచి నేస్తం. అప్పుడప్పుడూ తన ఆలోచనల్ని నాకు ఉత్తరాలుగా రాస్తుంటుంది. మొన్నటి ఉత్తరంలో నాకు నచ్చే ఓ మంచి మాట చెబుతున్నానంటూ ఏం రాసిందో చెప్పమంటారా.... "సంతృప్తి అనే తరువుకి మాత్రమే  సంతోష సుమాలు విరివిగా పూస్తాయి అని. బావుందికదా...?"

నేను తల ఊపుతూ "సంతృప్తి చెంది సర్దుకుని ఉండిపోతే అభివృద్ధి సాధ్యం కాదు కదా?" అన్నాను. సంతృప్తి, శ్రమ జీవనం రెండు జోడు గుర్రాలుగా బతుకు బండిని లాగాలి! అప్పుడే ఆనందం, అభివృద్ధి రెండూ మన స్వంతం అవుతాయి!" అన్నారు.

"మీ మాటలతో నా సమస్యకి ఒకదారి కనిపించింది. కృతజ్ఞుడిని...!" అంటూ నమస్కరించాను. "ఒకమాట, ఇది ఎంతో గౌరవంగా, ఆరాధనతో చేస్తున్న నా పాదాభివందనం అనుకోండి..." అన్నాను.

ఆయన ఎందుకోగానీ చప్పున నా రెండు అరిచేతుల్నీ తన కళ్ళకి ఆనించుకుని "ఈ పూట ఇలా మీతో కబుర్లు పంచుకోవటం నాకు చాలా ఆనందంగా ఉంది" అన్నారు.

నేను అక్కడినుండే మన ఊరికి వెనుదిరిగి వచ్చేశాను. నా నిర్ణయాన్ని మా వాడికి అదే ఖచ్చితమన్నట్లుగా చెప్పేశాను. నాకు నచ్చిన దారిలో నడవగలిగే స్వేచ్ఛ నేను సంపాదించుకున్నాను. ఇంటికి మరమ్మత్తులు చేయించి, కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాను. మా ఊరిలో జరుగుబాటులేని, నా అనే వాళ్ళులేని నిస్సహాయుల్ని ఎంపిక చేసుకుని బంధుత్వాలు ఏర్పరచుకుని ఓ కుటుంబాన్ని సంపాదించుకున్నాను. ఇప్పుడు వాళ్ళంతా ఎవరో అర్థమైందిగా... నా మేనకోడలికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేయటం, మనవడిని బాగా చదివించటం... ఇవీ మా కుటుంబ బాధ్యతలు.

మా ఇంటిని కూడా పిచ్చుకలకు ఆవాసంగా మార్చాలని చుట్టూ వరికంకుల్ని కట్టటం, అక్కడక్కడా నీటి ముంతల్ని పెట్టటం చేశాను. ఈ విషయాలన్నీ చెప్పి, మన స్నేహితులకి మా కుటుంబీకులను పరిచయం చేయాలని ఆహ్వానాలు పంపించాను!"

"నీ పిచ్చుక గూడు కథ బావుందిరా! నిన్ను అభినందించటానికి తగిన మాటలు నాకు తోచటం లేదు!" అంటూ రెండు చేతులతో మధుని హత్తుకున్నాను.

ఎక్కడి నుండో పిచ్చుకల కిచకిచలు వినిపించినట్లయి మనసంతా ఆహ్లాదమైంది.

* * *

**'నవ్య వీక్లీ' 15-8-2018**

**బలివాడ కాంతారావు స్మారక కథల పోటీలో**
**బహుమతి పొందిన కథ**